

ఎల్‌ఆర్‌ఎస్ తెచ్చిన తంటా

- వేల ప్లాట్లు నిషేధిత జాబితాలోకి...
- రామగుండంలో ఇష్టానుసారంగా
- ప్రొహిబిటెడ్‌లో చేర్చిన యంత్రాంగం
- కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలన్నీ నిషేధిత జాబితాలోనే...
- ఆందోళన చెందుతున్న సామాన్య జనం
- కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసినా మళ్లీ అదే తంతు
- రిజిస్ట్రేషన్లపైనా ప్రభావం
- చేతులెత్తేస్తున్న మున్సిపల్ యంత్రాంగం



కోల్‌సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు ఎల్‌ఆర్‌ఎస్ ఇప్పుడు కొత్త తంటాను తెచ్చిపెట్టింది. పైసాపైసా పోగు చేసుకుని ఇల్లు కట్టుకుందామని కొనుగోలు చేసిన ఇంటి స్థలాలు నిషేధిత జాబితాలో చూపిస్తుండడతో సామాన్యులు లబోదిబోమంటున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపాలిటీల మధ్య సమన్వయ లోపం సామాన్యుడికి శాపంగా మారింది. ప్రభుత్వం నుంచి మార్కెట్ రేటుపై స్థలాలు కొనుగోలు చేసి కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలు, పట్టాదారుల నుంచి కొనుగోలు చేసిన భూములను సైతం గుడ్డిగా ప్రొహిబిటెడ్‌లో చేర్చారు.

ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో ఒక ప్రముఖ వ్యాపారి ప్రధాన రహదారి పక్కన ఉన్న స్థలం ఎఫ్‌టీఎల్‌లో పడింది. ఎన్టీపీసీకి చెందిన పాత ఆయిల్‌మిల్ ప్రాంతంలో మరో వ్యక్తి ప్లాట్ కూడా ఎఫ్‌టీఎల్‌లోనే చూపుతుంది. ఎన్టీపీసీలోని ఏపీ ఫంక్షన్‌హాల్ పక్కన గోదావరిఖనికి చెందిన ఒక ప్రముఖుడి స్థలం ప్రొహిబిటెడ్‌లో పడింది. విచారణ చేస్తే అది ఒక ప్రముఖ చిట్‌ఫండ్ కంపెనీలో షూరిటీ ఉన్నట్టు చూపుతోంది. ఆ కంపెనీ పేరే తాను వినలేదని, ఈసీ చూపినా కూడా సరికాని పరిస్థితి. అలాగే ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని సగం ప్రాంతం ప్రొహిబిటెడ్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వం 40 నుంచి 50ఏళ్ల క్రితం మార్కెట్ రేటుపై ఉద్యోగులకు, మాజీ సైనికుల హౌసింగ్ సొసైటీలకు ఇచ్చిన భూములు సైతం నిషేధిత జాబితాలో పెట్టారు. గోదావరిఖని మార్కండేయకాలనీలో చుట్టూ భవనాలు ఉండి మధ్యలో ఖాళీగా ఉన్న స్థలం కూడా ప్రొహిబిటెడ్‌లో పడింది. సింగరేణి ప్రాంతంలోని స్థలాలను ప్రభుత్వం క్రమబద్ధీకరించగా వాటిలో ఎక్కువ భాగం ప్రొహిబిటెడ్‌లోకి వెళ్లిపోయాయి.

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ పథకం క్రితం 25,513 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 5,735కాగా, మిగిలినవి రామగుండం నగరపాలక సంస్థతోపాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్నాయి. ఈ నెల 25వేల దరఖాస్తుల్లో 4,521 దరఖాస్తులు ప్రొహిబిటెడ్ జాబితాలో ఉన్నాయి. అసైన్డ్, ప్రభుత్వం, ఇనాం, దేవాదయ, వక్ఫ్ భూములు, చెరువులు, కుంటలు, నాలాల ఎఫ్‌టీఎల్‌లు, బఫర్ జోన్ పరిధిలోని భూములు, హైటెన్షన్ వైర్ల సమీపంలోని భూములు ఇందులో ఎక్కువగా ఉన్నాయి. చెరువులు, కుంటలకు 200మీటర్ల దూరం వరకు ఉన్న భూములు సైతం ఎఫ్‌టీఎల్‌లో పెట్టారు. 16,910 దరఖాస్తులకు ఫీజు అప్రువల్ చేసి దరఖాస్తుదారులకు పంపారు. ప్రొహిబిటెడ్‌తో సంబంధం లేకుండా 3,568 దరఖాస్తులు మున్సిపల్, రెవెన్యూ, నీటి పారుదలశాఖ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అప్రువల్ లేకుండా పెండింగ్‌లో ఉన్నాయి. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 7,078 దరఖాస్తులు వస్తే కేవలం 3,920 దరఖాస్తులకు మాత్రమే ఫీజు అప్రువల్ ఇచ్చారు. మిగతా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

● ఫీజు చెల్లించినా అదే తంతు...

ప్రొహిబిటెడ్ జాబితా నుంచి తీసివేయాలంటే రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాలని, హౌసింగ్ సొసైటీలు వారికి కేటాయించిన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసినా, ఫీజు చెల్లించినా మళ్లీ ప్రొహిబిటెడ్ జాబితాలోకే వెళుతుంది. దీంతో సామాన్యులు పరేషాన్ అవుతున్నారు. చట్ట పరంగా తమకు అన్నీ అనుమతులు ఉన్నా ఎందుకు ప్రొహిబిటెడ్‌లో పెడతారంటూ గొడవకు దిగుతున్నారు. వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియక మున్సిపల్ సిబ్బంది సైతం తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం విషయంలో ఒక వైపు ఒత్తిడి ఉండగా సమస్యల విషయంలో మాత్రం ఇటు జిల్లా యంత్రాంగం గానీ, టౌన్ ప్లానింగ్ డైరెక్టరేట్ కార్యాలయం కానీ పట్టించుకున్న పరిస్థితి లేదు. ఇష్టానుసారంగా ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చడం వల్ల ఇప్పుడు మంచి కన్నా చెడే ఎక్కువయ్యే పరిస్థితి ఏర్పడింది.

మున్సిపల్ సిబ్బందితో గొడవలు...

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల్లో 4,521 దరఖాస్తులు ప్రొహిబిటెడ్‌లోకి వెళ్లాయి. ఇందులో కేవలం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ ఇష్టానుసారంగా ఇచ్చిన జాబితా ఆధారంగానే ప్రొహిబిటెడ్‌లో పెట్టారు. సివిల్ వివాదాల్లో కోర్టు కేసులు, తీర్పులకు అనుగుణంగానే ప్రొహిబిటెడ్‌లో పెట్టాల్సి ఉంటుంది. కానీ లీగల్ నోటీసులు ఇచ్చినా ప్రొహిబిటెడ్‌లో పెట్టారు. రామగుండం అర్బన్‌లో ఒకే తహసీల్దార్ కార్యాలయం ఉంది. ప్రస్తుతానికి ఆ తహసీల్దార్ కార్యాలయంలో పాత భూముల రికార్డులేవి అందుబాటులో ఉన్న పరిస్థితే లేదు. గతంలో సీసీఎల్‌ఏ, క్యాబినెట్ ఆమోదాలతో మార్కెట్ రేటుపై హౌసింగ్ సొసైటీలకు ఇచ్చిన భూముల్లో కాలనీలు సైతం వెలిశాయి. ఇల్లు కట్టుకోని వారి స్థలాలను ఇప్పుడు ప్రొహిబిటెడ్‌లో పెట్టారు. గోదావరిఖని మార్కండేయకాలనీ, ఎన్‌టీపీసీ కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో ఒక్కో సర్వే నంబర్‌లో 10ఎకరాల భూమి ఉంటే ఒక్క ప్లాట్‌పై ఉన్న కేసును పరిగణలోకి తీసుకుని ఆ సర్వే నంబర్‌నే ప్రొహిబిటెడ్‌లో పెట్టారు. దీని ప్రభావం స్థలాల యజమానులపై పడింది. వాటిని వివాదమైన స్థలాలుగా ప్రచారం అవుతున్న పరిస్థితి ఉంది. దీంతో భూముల యజమానులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి సిబ్బందితో గొడవలు పడుతున్నారు.



కాంగ్రెస్ శ్రేణుల నిరసన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ సోనియా, రాహుల్‌గాంధీల పేర్లను చేర్చడాన్ని నిరసిస్తూ శుక్రవారం కాలనీలో కాంగ్రెస్ శ్రేణులు నిరసనకు దిగాయి. కాలనీ గోదావరిఖని రోడ్డుపై బైఠాయించి ఈడీ, మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజకీయ కక్షతోనే బీజేపీ సోనియా, రాహుల్‌పై కుట్రపూరితంగా కేసు నమోదు చేయించినట్టు నాయకులు ఆరోపించా రు. స్వయంప్రతిపత్తి సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. రాహుల్ గాంధీకి వస్తున్న ఆదర చూసి భయంతో బీజేపీ కుట్రకు తెరలేపినట్టు తెలిపారు. నిరసనలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, శంకర్‌నాయక్, సాగంటి శంకర్, చక్రపాణి, తిరుపతిరెడ్డి, అనుము రాములు, రాజిరెడ్డి, మహేష్, కేశవులు, అవినాష్, సారయ్యానాయక్, రాకేష్, అఫ్సర్, అజయ్, బండారి సునీత, ఇరికి రాజేశ్వరి పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పని చేసే స్థలాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ సూచించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదావరిఖని ఆర్‌టీసీ డిపో, గ్యాస్ గోడౌన్‌లు, పెట్రోల్ బంక్‌ల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పనిచేసే చోట తప్పకుండా ఫైర్ సేఫ్టీ పరికరాలు అమర్చుకోవడంతో పాటు అందులో పని చేసే కార్మికులకు అగ్ని ప్రమాదాల నివారణపై, ఫైర్ సేఫ్టీ పరికాలపై అవగామన కల్పించిన అగ్ని ప్రమాదాలు సంబంవించినప్పుడు మంటలను ఆర్పేందుకు శిక్షణ కూడా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రాజేశం, బాణయ్య, అశోక్, శ్రీనివాస్, బాబు పాల్గొన్నారు.

'భూ భారతి'పై నేడు అవగాహన సదస్సు

ధర్మారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి పోర్టల్‌పై శనివారం అవగాహన సదస్సు కల్పించనున్నట్లు తహసీల్దార్ ఎండీ వకీల్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మేడారం రైతు వేదికలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు జిల్లా కలెక్టర్ కోయా శ్రీహర్ష పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చట్టంలోని అంశా లను ప్రజలకు వివరించి అనుమానాలను నివృత్తి చేస్తారని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోల్‌సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సబ్‌స్టేషన్ వరకు మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ కె వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

గోదావరిఖనిలోని రాంమందిర్, జనగామ, వీజీ సెంటర్, గౌతమినగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తరుగులేకుండా ధాన్యం కొనుగోలు

- సన్నవడ్లకు బోనస్‌తో రాష్ట్రంలోనే పెద్దపల్లిలో అత్యధిక సాగు - ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

సుల్తానాబాద్, ఏప్రిల్ 18: (ఆంధ్రజ్యోతి): ధాన్యంలో ఎలాంటి తరుగులేకుండా కొనుగోలు చేస్తున్నామని, సన్నవడ్లు పండించే రైతాంగానికి క్వింటాలుకు ఐదు వందల చొప్పున బోనస్ ప్రకటించడంతో రాష్ట్రంలోనే పెద్దపల్లి నియోజకవర్గ రైతులు అత్యధికంగా సాగు చేశారని, రాష్ట్రంలో అందరి కంటే ఎక్కువగా బోనస్ పొందారని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండంలోని నారాయణరావుపల్లి, గొల్లపల్లి, సాంబయ్యపల్లి, ఐతరాజుపల్లి, భూపతిపూర్, గర్రెపల్లి, బొంతకుంటపల్లి,నర్సయ్యపల్లి, నీరుకుళ్ల, గట్టేపల్లి, కదంబాపూర్, తొగర్రాయి తదితర గ్రామాల్లో సహకార సంఘం, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు రాష్ట్రవ్యాప్తంగా సన్నవడ్లు పండించిన రైతులకు 1,234 కోట్ల రూపాయలు అందివ్వగా ఒక్క పెద్దపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 59 కోట్ల 15 లక్షల రూపాయలు బోనస్ ఇచ్చారన్నారు. కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, పన్నాల రాములు, సింగిల్ విండో చైర్మన్లు జూపల్లి సందీప్‌రావు, శ్రీగిరి శ్రీనివాస్, కోటవీణ రాజు, డీపీఎం నాగేశ్వర్‌రావు, ఏపీఎం గీత, నాయకులు పాల్గొన్నారు.

ఓదెల: ధాన్యంలో ఎలాంటి కోతలేకుండా కొనుగోలు చేస్తున్నామని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని కొలనూర్, ఓదెల, ఉప్పరపల్లి, గోపరపల్లి, హరిపురం, నాంసానిపల్లి గ్రామాల్లో ఐకేపీ, సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ సర్పంచ్‌లు బొంగోని రాజయ్య, సామ శంకర్, విజయేందర్‌రెడ్డి, గుండేటి మధు, ఆకుల మహేందర్, గుండేటి ఐలయ్య, అసంశెట్టి కృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.





భూపతిపూర్, జయ్యారంలో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్

ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దు

పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులకు విక్రయించి మోసపోవద్దని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సూచించారు. శుక్రవారం మండలంలోని బసంత్‌నగర్, పాలకుర్తి, గుంటూరుపల్లి, ఎల్కలపల్లి, కొత్తపల్లి, రామరావుపల్లి, ఈసాలతక్కళ్లపల్లి, పుట్నూర్, గుడిపెల్లి, జయ్యారం, కుక్కలగూడూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యాసంగిలో పండిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. సన్నవడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. అనంతరం జయ్యారం గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. కార్యక్రమంలో రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, కన్నాల పీఏసీఎస్ చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, మక్కాన్‌సింగ్ సేవ సమితి చైర్మెన్ మనాలి ఠాకూర్ పాల్గొన్నారు.

మా ఇళ్లను కూల్చకండి

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు బాధితుల విన్నపం

ధర్మారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తామంతా నిరుపేదలమని కొన్నేళ్లుగా ప్రభుత్వ భూమిలో ఇళ్లు కట్టుకొని నివసిస్తున్నామని ఇళ్లు కూల్చకుండా చూడాలంటూ బాధిత మహిళలు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శుక్రవారం కలిసి విన్నవించారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 476లో కోట్ల రూపాయల విలువ చేసే వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొన్ని సంవత్సరాలుగా అక్రమ నిర్మాణాలు చేపడుతూ కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని భూ ఆక్రమణదారులు కొల్ల గొడుతున్నారు.

ఇదే సర్వే నంబర్‌లో చాలా మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పేద ప్రజలు కూడా ఇళ్లు కట్టుకొని కొన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు. కాగా ప్రభుత్వ భూముల ఆక్రమణ విష యంలో పెద్దపల్లి కలెక్టర్ కోయా శ్రీహర్ష సీరియస్‌గా ఉన్న నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ ఎండీ వకీల్ కొన్ని రోజుల క్రితం కలెక్టర్ ఆదేశాలతో భూఆక్రమణ దారులందరకీ నోటీసులు జారీ చేశారు. రెవె న్యూ సిబ్బందితో కలసి ప్రతి ఇంటికి వెళ్లి సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఈ క్రమంలో ధ్రువపత్రాలు సరిగా లేక ప్రభుత్వ భూమిలో తాత్కాలిక నిర్మాణాలు చేప ట్టిన నాలుగింటిని బుదవారం కూల్చివేసి 0.24 గుంటల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యతో భూ ఆక్రమణ దారుల్లో గుబులు మొదలైంది. వివిధ కోణా ల్లో ప్రభుత్వ భూమిని 0.2 గుంటలకు పట్టాలు పొందిన వారు, వారి భార్యల పేరు మీద, కుటుం బసభ్యుల పేరు మీద రెండు మూడు నకిలీ పట్టాలు తీసుకొని ఆరు నుంచి పది గుంటల ప్రభుత్వ భూమి ని స్వాధీన పరచుకున్నారు. వీరి అత్యాశ ఇప్పుడు పేదల ఇళ్లకు ముప్పు తెచ్చేలా ఉందని నిరుపేద మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రమంలో పేద కుటుంబాలకు చెందిన వారంతా శుక్రవారం ధర్మపురిలోని క్యాంపు ఆఫీసుకు వెళ్లి అడ్లూరి లక్ష్మణ్ కుమర్‌ను కలిశారు. తామంతా నిరుపేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలమని కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నామని తెలిపారు. అధికారులు తమకు నోటీసులు ఇవ్వడంతో ఏంచేయాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అడ్లూరి స్పందించారు. వెంటనే తహసీల్దార్ వకీల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తాను వచ్చి పరిశీలించే వరకు ఎవరి ఇళ్లను కూల్చవద్దంటూ ఆదేశించారు. ఈ సందర్భంగా అర్హులైన పేదవారి ఇళ్ల జోలికి వెళ్లబోమని బాధిత మహిళలకు విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు.





అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు విన్నవించుకుంటున్న నోటీసులు అందుకున్న బాధితులు, ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను కూల్చుతున్న అధికారులు (ఫైల్)

వివాహ దినోత్సవంలో దంపతుల అవయవదానం

ఓదెల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రేగుల సువర్ణ, సదానందం దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా దంపతులు సదాశయ ఫౌండేషన్ వారికి అవయవాలను దానం చేస్తూ పత్రాలను శుక్రవారం అందజేశారు. తమ 25వ వివాహ దినోత్సవం సందర్భంగా దంపతులు మరణాంతరం నేత్రాలు, అవయవాలను దానం చేస్తామని అంగీకార పత్రం అందజేశారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మచారి, జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, లింగమూర్తి, డాక్టర్ కనికిరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆయుర్వేద శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మాతా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో ఆదివారం కాలనీలో ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్టు ఆర్జీ-2 అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. సీఈఆర్ క్లబ్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే వైద్య శిబిరంలో ఆయుర్వేద వైద్యుడు విశ్వనాథ మహర్షి వైద్య పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. ఉద్యోగులు, కాలనీ వాసులు ఈవైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనిల్‌కుమార్ ప్రకటనలో తెలిపారు.

హుజూరాబాద్‌లో పట్టపగలే చోరీ..

● సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు

హుజూరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని మార్కండేయ కిరాణం షాపులో శుక్రవారం పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లారు. సదరు గుర్తుతెలియని వ్యక్తులు కిరాణం సామగ్రి కోసం షాపునకు వచ్చారు. షాపు యజమాని లోపలికి వెళ్లి సామగ్రి ఇస్తుండగా, కౌంటర్‌పై ఉన్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను దొంగలించారు. ఇది గమనించిన షాపు యజమాని మార్కెండేయ పోలీసులకు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. 15రోజుల క్రితమే హుజూరాబాద్ పట్టణంలోని రెండుషెటర్లను పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. అది మరవక ముందే మరోదొంగతనం జరగడంతో పట్టణప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ముగురికి గాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారిపై మానకొండూర్‌లో శుక్రవారం లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. సూర్యపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్ 29 టిబి 3876)లో కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తోంది. బస్సు ముందు ఉన్న గ్రానైట్ లారీ(టీఎస్ 02 యుబి 8907) సడన్ బ్రేకు వేశాడు. దీంతో లారీ వెనకాలే వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వరంగల్ జిల్లాకు చెందిన మణికంఠ, రజిత, భారతికి గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రెండు వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

మినీ వ్యాన్, ఆటో ఢీ..

● నలుగురికి గాయాలు



నుజ్జు నుజ్జు అయిన ఆటో

కోనరావుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయ ఆవరణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ ఆటోలో గ్యాస్‌సిలిండర్లను డెలివరీ చేయడానికి వెళుతున్నాడు. కొలనూరు గ్రామానికి చెందిన శిల్ప, లాస్య, సుదర్శన్ ముగ్గురు టాటా ఏసీలో కోనరావుపేటకు వస్తున్నక్రమంలో నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయ ఆవరణలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టాయి. దీంతో ఆటో డ్రైవర్ శ్రీనివాస్, శిల్ప,లాస్య, సుదర్శన్‌కు తీవ్ర గాయాలుకాగా, సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోనరావుపేట ఎస్‌ఐ ప్రశాంత్‌రెడ్డి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఔషధ మొక్కలకు జీవం

ఆర్జీ-3లో 42 రకాల ఔషధ మొక్కలతో నర్సరీ ఏర్పాటు



రామగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కలకు జీవం పోసేందుకు సింగరేణి యాజమాన్యం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొలిసారిగా ఆర్జీ-3 డివిజన్ పరిధి సెంటినరీకాలనీలోని ఔషధ మొక్కల నర్సరీని పబ్లిక్ పార్కుకు ఎదురుగా ఏర్పాటు చేసింది. విశాలమైన స్థలంలో ఔషధ మొక్కలను ఏర్పాటు చేసి సంరక్షణ చర్యలు చేపడుతోంది. సదరు కేంద్రంలో 42 రకాల వివిధ ఔషధ మొక్కల పెంపకం చేపడుతోంది. తొలి అడుగుగా సుమారు అరఎకరంలో ఔషధ మొక్కల నర్సరీని సింగరేణి ఫారెస్ట్ విభాగం ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా మొక్కల పెరుగుదల కోసం సేంద్రియ ఎరువులను వినియోగించి ఔషధ మొక్కలను సంరక్షణ బాధ్యతలను తీసుకుంది. అన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులకు ఉపయోగపడే ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పెంపకం చేపట్టింది. ప్రస్తుతం నర్సరీలో వనమూలికలు సేకరించేందుకు వీలుగా మొక్కలు అందు బాటులోకి రావడం విశేషం. అందులో ప్రధానంగా క్యాన్సర్, ఆస్తమా, షుగర్, బీపీ లాంటి వ్యాధులను నయం చేసే మొక్కల పెంపకం చేపట్టింది. వ్యాధుల నివారణకు వినియోగించే మొక్కలపై స్థానికులకు అవగాహన కల్పించే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు చేపడుతోంది.



ఆర్జీ-3 డివిజన్‌లో ఔషధ మొక్కల కేంద్రం

ఔషధ మొక్కలను అందిస్తాం

ఆర్జీ-3 ఫారెస్ట్ అధికారి: కల్యాణ్



ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా ఔషధ మొక్కల నర్సరీని ఏర్పాటు చేశాం. ఇందులో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ కోసం ఏర్పాటు చేసిన మొక్కలు లభ్యం అవుతాయి. ఆయుర్వేదం ఆదరణ కరువైన నేపథ్యంలో వాటి ప్రాధాన్యాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా డివిజన్‌లో తొలిసారిగా ఔషధ మొక్కల పెంపకాన్ని చేపట్టింది. మండలంలోని కేవీకే, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఔషధ మొక్కల ఏర్పాటుకు ఆసక్తి కనబరిచారు. ఔషధ మొక్కలను అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. కార్మిక కుటుంబాలు ఆసక్తి కనబరిస్తే వారికి ఔషధ మొక్కలను అందించేందుకు సింగరేణి సుముఖంగా ఉంది.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

● రాష్ట్ర వ్యాప్తంగా 85కేసులు నమోదు

● పీడీ యాక్ట్ కేసులో నాలుగు సంవత్సరాల జైలుశిక్ష

● జమ్మికుంటలో అదుపులోకి తీసుకున్న పోలీసులు



అంతర్‌జిల్లా దొంగను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

జమ్మికుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో మూడు రోజుల క్రితం వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలు తాడు ఎత్తుకెళ్లిన అంతర్‌జిల్లా దొంగను పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి శుక్రవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, పట్టణసీఐ వరంగంటి రవికుమార్ చోరీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా వడ్డెరకాలనీకి చెందిన అల్లెపు కృష్ణ ఎక్కడకు వెళ్లిన తాను పంచాయతీ కార్యదర్శిని అని, పెన్షన్ ఇప్పిస్తానని చెప్పుకుంటూ అమాయకప్రజలను నమ్మిస్తూ వారి మెడలోని బంగారుగొలుసులు ఎత్తుకెళ్తుంటాడు. మూడు రోజుల క్రితం జమ్మికుంటలోని కొండూర్‌కాంప్లెక్స్‌లో అల్లెపురెడ్డి కమలమ్మ-కొండారెడ్డి వృద్ధ దపంతులను అదేవిధంగా నమ్మించి బురిడి కొట్టించాడు. రూ.4వేల పెన్షన్ ఇప్పిస్తానని చెప్పి, మెడలోని రూ.80వేల విలువగల పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. చోరీని సీరియస్‌గా తీసుకున్న పోలీస్‌లు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మూడురోజుల వ్యవధిలో సదరు దొంగను వలపన్ని పట్టుకున్నారు. మళ్లీ చోరీ కోసం జమ్మికుంటకు వచ్చిన దొంగను గాంధీచౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. అతడి దగ్గరి నుంచి జమ్మికుంట చోరికి సంబంధించి రూ.80వేల విలువ గల పుస్తెలు తాడు, హైదరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చోరీకి సంబంధించి తులంన్నర బంగారం స్వాధీనం చేసుకున్నారు. అల్లెపుకృష్ణపై జమ్మికుంటలో మూడుకేసులు, హుజూరాబాద్‌లో మూడుకేసులు, కరీంనగర్‌లో 10కేసులు, రాష్ట్ర వ్యాప్తంగా 85కేసులు నమోదై ఉన్నాయి. రెండుసార్లు పీడీయాక్ట్ కేసుల్లో నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. అయిన అతడిలో ఎలాంటి మార్పు రాలేదు. అతడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించి నట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి దొంగల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గంగాధర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. వారివివరాల ప్రకారం.. కోనరావుపేట మామిడిపల్లికి చెందిన ఐలయ్య ద్విచక్రవాహనంపై గంగాధర వస్తున్నాడు. గంగాధర నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న కారు ఐలయ్య వాహనాన్ని ఢీకొట్టింది. ఈప్రమాదంలో కాలు, చేతులు విరిగిఐలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో కరీంనగర్ తరలించగా ప్రస్తుతం ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదవిషయాన్ని స్థానికులుపోలీసులకుసమాచారం అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శాయంపేట గ్రామానికిచెందిన మడికొండ శ్రీనివాస్ రావు (42) గడ్డిమందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాతపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌రావు ఎనిమిది సంవత్సరాల క్రితం తనసొంత ట్రాక్టర్ నడుపుతుండగా యాక్సిడెంట్ చేయడంతో ఓవ్యక్తి మృతిచెందాడు. ఖర్చుల నిమిత్తం ట్రాక్టర్, భూమి అమ్మేశాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసవడంతో ఆరోగ్యం క్షీణించింది. ఈనెల15న గడ్డిమందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎమ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్యలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రావిటీ కెనాల్‌లో పడి యువకుడి గల్లంతు

రామడుగు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన పురాణం సాగర్(32) అనే యువకుడు గ్రావిటీకెనాల్‌లో పడి గల్లంతైనట్లు తెలిసింది.. కరీంనగర్-గోపాల్‌రావుపేట ప్రధానరహదారిలో గల రామడుగు రైతువేదికవద్ద గ్రావిటీ కెనాల్‌లోసాగర్ శుక్రవారం రాత్రిపడ్డట్లు గ్రామస్థులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అకాల వర్షం..అపార నష్టం

● తడిసిన ధాన్యం ● నేల రాలిన మామిడి ● ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు



కోరుట్లలో నేల కొరిగిన నువ్వు చేను



కోరుట్లలో నేల రాలిన మామిడి కాయలు



మెట్‌పల్లి మండలం ఎర్దండిలో కూలిన గుడిసె వద్ద కుటుంబ సభ్యులు

కోరుట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి, భీమారం, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్ తదతర మండలాల్లో శుక్రవారం అకాల వర్షం కురిసింది. దీంతో మామిడి నేల రాలింది. కోతకు వచ్చిన వరి నేల వాలింది. నువ్వు పంట నేలవాలి రైతులు లబోదిబోమన్నారు. కోరుట్ల మండలంలోని మాదాపూర్, పైడిమడుగు, చిన్నమెట్‌పల్లి, పైడిమడుగు, సర్పరాజుపూర్, అయిలాపూర్, కల్లూర్ గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో మామిడి నేల రాలింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొంత మేర తడవగా నువ్వు పంట నేలకొరిగింది. మామిడి నేల రాలడంతో రైతులుకు భారీ నష్టం వాటిల్లింది. గాలి బీభత్సంతో మాదాపూర్ గ్రామ శివారులోని రాయికల్-కోరుట్ల రోడ్డుకు ఆనుకొని ఉన్న తాటి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై వాలింది. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా విద్యుత్ శాఖ అధికారులు మరమ్మత్తులు చేసి సరఫరాను పునరుద్ధరిచారు.

●మెట్‌పల్లిటౌన్: మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం గాలివానతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇబ్రహీంపట్నం మండలకేంద్రంతోపాటు ఆయాగ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిచింది. ఎర్దండి గ్రామ శివారులోని ఒడ్డెర కాలనీలో నివాసం ఉంటున్న గుడిసెలు తీవ్రగాలులతో లేచిపోయాయి. దీంతో అందులో నివాసం ఉంటున్న కుటుంబాలు ఆశ్రయం లేక రోడ్డున పడ్డాయి.

●భీమారం: భీమారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. భీమారం మండల కేంద్రానికి చెందిన నల్ల పోచయ్య ఇంటి పైకప్పు లేచిపోగా, భూదేవికి చెందిన ఇల్లు కూలిపోయింది. కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయింది. మండలంలోని వడ్లకొండ విశ్వంభర్, పెద్దిరెడ్డి స్వామి రెడ్డి, అడువాల రాజేశం తదితర రైతులకు చెందిన మామిడి తోటల్లో మామిడి కాయలు రాలాయి.

●కథలాపూర్: మండలకేంద్రంలో శుక్రవారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగి పడ్డ ఘటనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్ (ఐఎల్ఆర్), రెండు డీప్ ఫ్రీజర్లు, వ్యాక్సిన్ క్యారియర్ బాక్స్‌లు కాలిపోయాయి. గదిలో ఉన్న ఫర్నిచర్ కాలి బూడిదయిందని ఈ ప్రమాదంలో రూ.25 లక్షల ఆస్తినష్టం సంభవించిందని హెచ్ఈఓ శ్రీధర్ తెలిపారు. మండలంలోని పలుగ్రామాల్లో ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోగా, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోయింది.

● కోరుట్ల: కోరుట్ల పట్టణంలో శుక్రవారం గాలి వాన బీభత్సం సృష్టించింది. పట్టణంలోని రాంనగర్, బీలాల్ పుర, అల్లమయ్య గుట్ట ప్రాంతాల్లో సాంకేతిక లోపంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

●ముస్తాబాద్: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చింది. ముస్తాబాద్‌తోపాటు మద్దికుంట, చీకోడ్ గ్రామాల్లో భారీగా పంటనష్టం జరిగింది. వర్షంతోపాటు ఈదురు గాలులతో వరిగింజలు, మామిడి కాయలు రాలిపోయాయి. ముస్తాబాద్‌కు చెందిన ఎలుసాని దేవయ్య అనే రైతుకు చెందిన దాదాపు అయిదు ఎకరాల వరిపంట పూర్తి స్థాయిలో నెలమట్టమయింది. కొనుగోలు సెంటర్లలో ధాన్యం తడిసిపోయింది. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పంట నష్టం జరిగింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. బాధిత రైతులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, నాయకులు పరామర్శించారు.

● గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలో శుక్రవారం కురిసిన ఈదురుగాలులతో కూడిన రాళ్లవాన వరి పంటలకు అపారనష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు కోతలకు వచ్చిన వరిచేలు నేలపాలయ్యాయి. కోసి కుప్పలు పోసిన వరిధాన్యం వర్షానికి తడిసిపోయింది. ప్రధానంగా కొత్తపల్లి, ముచ్చర్ల గ్రామాల్లో రాళ్లవానతో వరిపంటలకు తీవ్రనష్టం వాటిల్లినట్టు రైతులు తెలిపారు. కొత్తపల్లికి చెందిన బాలయ్య, మహేష్, శంకర్, దేవేందర్, సంజీవం తదితర రైతుల పంటలకు అపార నష్టం వాటిల్లింది. ముచ్చర్లలో జీవన్, కిషన్, మల్లయ్య, ఎల్లయ్య, వెంకటస్వామి, దేవయ్య, తదితర రైతులకు చెందిన కోతకు వచ్చిన వరి రాళ్ల వానతో నష్టం కాగా, భిక్షపతి, కనకయ్య, రవీందర్‌రెడ్డి, దుర్గయ్య, నర్సయ్య, రమేష్ తదితర రైతుల కోతలు కోసి కళ్లాల వద్ద ఉంచిన ధాన్యం తడిసిపోయింది. నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని రైతులు కోరారు. ఇదిలా ఉండగా రాజుపేటలో వర్షానికి ధాన్యం తడిసిపోయింది. నర్మాలలో ఈదురు గాలులకు రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడగా, ముచ్చర్ల నుంచి పోతారం వెళ్లే దారిలో కూడా ఈదురు గాలులకు చెట్టు విరిగిపడింది.

జల్సాల కోసం చోరీలు

● పోలీసులకు చిక్కిన యువకులు



ముస్తాబాద్ ఠాణాలో దొంగల అరెస్టు చూపుతున్న సీఐ మొగిలి

ముస్తాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం చోరీకి పాల్పడిన యువకులు పోలీసులకు దొరికి జైలుకు వెళ్లిన సంఘటన ముస్తాబాద్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ మొగిలి తెలిపినవివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని శుభోదయ మండల సమాఖ్య నుంచి ఒక ఐచర్ ట్రాక్టర్, కుట్టు మిషన్‌ను గత ఫిబ్రవరిలో గుర్తుతెలియని దొంగలు ఎత్తుకె ళ్లారు. సమాఖ్య అధ్యక్షురాలు అల్వాల దేవిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. వాటిని ఎత్తుకెళ్లిన దొంగల కాల్‌డాటా, సీఆర్ఆర్ డంప్స్ ఆధారంగా నిందితులను గుర్తించారు. పక్కా సమాచారం మేరకు కుట్టు మిషన్ ఎత్తుకెళ్లిన ముస్తాబాద్‌కు చెందిన మహ్మద్ షాదుల్లా, దావిరెడ్డి నరేందర్‌రెడ్డితోపాటు సిద్దిపేటకు చెందిన మహ్మద్ సమీర్‌ను అరెస్టు చేశారు. వారివద్ద ఉన్న రూ.6లక్షల ఐచర్ ట్రాక్టర్‌తోపాటు కుట్టు మిషన్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. అలాగే వారివద్ద ఉన్న మోటర్‌సైకిల్, ఇండికా కార్, మూడు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా రాఘురూకుల గ్రామానికి చెందిన మల్లేశం పరారీలో ఉన్నట్లు వివరించారు. జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దొంగలను పట్టుకున్న ఎస్‌ఐ సీహెచ్ గణేశ్, హెచ్‌సీలు బాల్‌నర్సయ్య, పీసీలు రాజశేఖర్, ఖాసీంలను సీఐ మొగిలి అభినందించారు.

చెరువులో పడి బాలుడి గల్లంతు



రాజేష్(ఫైల్)

మల్లాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పశువుల కాపరికి సహాయకుడిగా వెళ్లిన పుట్ట రాజేష్(13) అనేబాలుడు చెరువులో పడి శుక్రవారం గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పుట్ట పోశెట్టి పశువులకాపరిగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం పోశెట్టికి ఇతర పనులు ఉండడంతో గ్రామానికి చెందిన ఓ వృద్ధుడిని పశువులు మేపడానికి పంపాడు. గుడ్ ఫ్రైడే సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో పుట్ట రాజేష్ వృద్ధుడి వెంట సహాయకుడిగా గ్రామశివారులోకి వెళ్లాడు. సాయంత్రం పశువులను ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో గ్రామ శివారులో ప్రమాదవశాత్తు పెద్దచెరువులో కాలుజారి పడి గల్లంతుయ్యాడు. చెరువులో గ్రామస్థులు వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

బారాత్‌లో తల్వార్‌తో హంగామా

● నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జవారిపేట గ్రామానికి చెందిన గౌరవేని శ్రీకాంత్ అనే యువకుడు తల్వార్‌తో బెదిరించడంతో అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. ఎక్స్‌కావేటర్ నడుపుకుంటూ జీవించే శ్రీకాంత్ ఈనెల16న జవారిపేటలో జరిగిన పెళ్లి బరాత్‌లో తల్వార్‌తో బెదిరింపులకు గురిచేయడమే కాకుండా అడ్డు చెప్పిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. అనంతరం గ్రామం నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం తాళ్లపెల్లి సమీపంలో పట్టుబడినట్లు తెలిపారు. అతడు ప్రయాణిస్తున్న వాహనంలో సోదాచేయగా తల్వార్‌తో పాటు కత్తి లభించినట్లు తెలిపారు. శ్రీకాంత్‌ను విచారించగా డ్రైవర్‌గా వచ్చిన డబ్బులు సరిపోవడం లేదని ఆరు నెలల క్రితం గురుద్వార్ వెళ్లినప్పుడు తల్వార్, కత్తిని కొనుగోలు చేసి తీసుకవచ్చానని తెలిపాడు. ఇతడిపై ఇప్పటికే ఏడు కేసులు ఉన్నట్లు తెలిపారు. కానిస్టేబుల్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు నిండితుడిని అరెస్టు చేసి అతని నుంచి థార్ వాహనాన్ని, తల్వార్, కత్తిని సీజ్ చేసినట్లు తెలిపారు.

శాంతినగర్‌లో వ్యక్తి ఆత్మహత్య

జ్యోతినగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో బండ మోహన్(35) గురువారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని సంతోష్‌నగర్‌కుచెందిన మోహన్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. శాంతినగర్‌లో ఒక అద్దె ఇంట్లో కుటుంబంతో ఉంటున్నాడు. ఈక్రమంలో గురువారంరాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన మోహన్‌భార్యతో గొడవపడ్డాడు. తాగినమత్తులో భార్య, ఇద్దరుపిల్లలను కొట్టి తనగదిలోకివెళ్లి చున్నీతోసీలింగ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిఅన్న బండ రవి ఫిర్యాదు మేరకుకేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు.

హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో బోర్నపల్లి వాసి మృతి

హుజూరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన యువకుడు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలప్రకారం.. బోర్నపల్లికి చెందిన కుతాడి జీవన్(23) హైదరాబాద్‌లో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వృత్తిలో భాగంగా డెలివరీ ఇవ్వ డానికి వెళ్తుండగా మణికొండ వద్ద కారు ఢీకొంది. అనంతరం లారీ కింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జీవన్ మృతిచెందడంతో బోర్నపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థిని ప్రతిభ..

● చిత్రలేఖనం, సంగీతంలో రాణిస్తున్న విద్యార్థిని ● పలువురి ప్రశంసలు అందుకుంటున్న అర్చన



అర్చన గీసిన చిత్రాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆ చిన్నారి పెన్సిల్ పట్టుకుంటే.. అందమైన చిత్రం కాగితంపై ఆవిష్కృతం అవుతుంది. సమయం దొరికినప్పుడల్లా కళకు జీవం పోస్తుంది. చిత్రలేఖనంతోపాటు సంగీతంలోనూ ప్రతిభ కనబరుస్తూ పలువురి ప్రశంసలందుకుంటోంది ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన విద్యార్థిని రామ అర్చన.

చిన్నతనం నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి..

మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన రామ కృష్ణవేణి-దామోదర్ దంపతులకు ఇద్దరు కూతుళ్ల అర్చన, శ్రావ్యలు. పెద్ద కూతురు అర్చన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచే కాగితాలపై చిత్రాలు గీయడం అలవాటు చేసుకుంది. ఖాళీ సమయాల్లో చిత్రాలు గీస్తూ ప్రతిభను చాటుకుంటోంది. తల్లిదండ్రులు ఆమె ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతో మరింతా ముందుకు సాగుతోంది. రాధాకృష్ణులు, శివుడు, మహిళలు బతుకమ్మ ఆడడం తదితర చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి.

సంగీతంలోనూ ప్రావీణ్యం..

చిత్రలేఖనంతో పాటు సంగీతంలోనూ అర్చన రాణిస్తోంది. దేశభక్తి, సినీ గేయాలు క్యాషియోపై వాయిస్తూ ఆశ్చర్యపరుస్తోంది. పాఠశాల వార్షికోత్సవంలో ప్రతిభను చాటుకుని పలువురి ప్రశంసలందుకుంది.



క్యాషియో వాయిస్తున్న అర్చన

మ్యూజిక్ డైరెక్టర్‌నవుతా..: విద్యార్థిని అర్చన

భవిష్యత్తులో ఆర్టిస్ట్‌తోపాటు మ్యూజిక్ డైరెక్టర్ కావాలనేది నా లక్ష్యం. నేను గీసిన చిత్రాలు ప్రదర్శనగా ఉంచి అందరి చేత ప్రశంసలు అందుకోవాలని నా కోరిక.



మామిడి, అల్లనేరేడు చెట్లకు చేసిన అలంకారం

మామిడి చెట్లకు కల్యాణం

● ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా శివ పార్వతుల కల్యాణం

కథలాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని గంభీర్‌పూర్‌లో శుక్రవారం ముదిరాజ్ సంఘ సభ్యులు తమ ఎనిమిది ఎకరాల మామిడి తోటకు వివాహం జరిపారు. తోటను సాగు చేసుకుని ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా శివుడు(అల్లనేరేడు), పార్వతి (మామిడి) చెట్లను శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పండితులు మాధవాచార్యులు వేద మంత్రోచ్చరణల మధ్య సంఘ సభ్యులు కల్యాణం జరిపారు. ఐదేళ్లకు కాత వచ్చే దశ కావడం వల్ల అధిక దిగుబడి రావాలనే ఉద్దేశ్యంతో పెళ్లి జరిపించామని సంఘ సభ్యులు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి గంగాధర్, గండి రవి, కొండగట్టు, గండి తిరుపతి, సంఘ సభ్యులు ఉన్నారు.




కల్యాణం నిర్వహిస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు

యువకుడి అదృశ్యం



గణేష్ (ఫైల్)

గొల్లపల్లి ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన చిట్యాల గణేష్ (19) గురువారం నుంచి కనిపించడం లేదని వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గొల్లపల్లి ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్, వారి కుటుంబ సభ్యులకు తెలపాలని కోరారు.



ఆచీతూచి

అడుగు వేయాలి

ఇంటర్ తర్వాత కోర్సుల ఎంపికే కీలకం

మూడు, నాలుగేళ్లు కష్టపడితే జీవితం ఆనందమయం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ఫలితలు కొన్ని రోజుల్లో వెలువడనున్నాయి. తరువాత ఏం చదవాలి, ఏరంగంలో స్థిరపడాలనే సందేహాలు విద్యార్థుల మెదడులో మెదులుతూ ఉంటాయి. దీనికి తల్లిదండ్రుల ఒత్తిడి, వివిధ కళాశాల పీఆర్వోల హంగామా తోడైంది. ఇంటర్ తర్వత చదివే కోర్సులే జీవితాన్ని మలుపు తిప్పుతాయి. డాక్టర్, ఇంజనీరింగ్, శాస్త్రవేత, చార్టర్ అకౌంటెంట్, బ్యాంకు ఉద్యోగులు,వివిధ ప్రభుత్వకొలువులు ఇలా అనేక అవకాశాలు ఊరిస్తూ ఉంటాయి. దీంతో విద్యార్థి ఊగిసలాడుతూ ఉంటారు. నిర్దిష్ట ఆలోచన, విద్యార్థి అభిరుచి, ఆసక్తే ఇక్కడ కీలకం. విద్యార్థికి ఆసక్తి, అభిరుచి ఉన్న కోర్సు ఎంపిక చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక కథనం..

● డీఎడ్ ప్రాథమిక బోధన..

ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ ఉంటే రెండేళ్ల డీఎడ్ కోర్సులో చేరవచ్చు. జిల్లాలో ఇలాంటి కళాశాలలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉన్నాయి. డీఎడ్ కామన్ ఎంట్రన్స్ పరీక్షతో సీటు లభిస్తుంది. అతి త్వరలోనే ఒక ప్రభుత్వ ప్రకటన వెలువడుతుంది.

● ఉపాధితోనూ సేవ చేయాలనుకుంటే...

బైపీసీ విద్యార్థులకు బీఎస్సీ నర్సింగ్ ఒక చక్కని అవకాశం. ఉపాధి పొందుతూ పేదలకు సేవ చేసేందుకు ఈ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంటర్ తర్వాత నాలుగేళ్ల కోర్సును ఎంపిక చేసుకుంటే ఆపై వెంటనే ఉద్యోగం లభిస్తుంది. రెండేళ్ల ఫిజియో థెరపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

● సీఏతో ఉన్నత హోదా

దేశ ఆర్థిక వ్యవహారాల్లో పర్యవేక్షణ, నియంత్రికకు సీఏ కోర్సు దోహదపడుతుంది. ఇంటర్ తర్వాత సీపీటీ ప్రవేశ పరీక్ష ఉంటుంది. అర్హత సాధించి ఐపీసీసీలో చేరవచ్చు. నాలుగున్నరేళ్లు చదివితే సమాజంలో ఉన్నత హోదాలో కొనసాగే అవకాశం ఉంటుంది.

● ఇంజనీరింగ్..

ఎప్‌సెట్లో ఇంజనీరింగ్ కోర్సులకు ప్రాధాన్యం అధికం. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్, ఐటీ, ఈఈఈ, వంటి కోర్సులు ఉన్నాయి. ఆసక్తి ఉంటే దేంట్లోనైనా రాణించే అవకాశం ఉంటుంది.

● వ్యవసాయం, ఉద్యానవనం

ఎప్‌సెట్‌తోనే బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్(బై పీసీ విద్యార్థులకు) చదివే అవకాశం ఉంటుంది. నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్ ఆపై పీజీ తరువాత పరిశోధన వైపు అడుగులు వేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

● న్యాయ వృత్తి...

ఇంటర్ తర్వాత ఐదేళ్ల న్యాయవిద్య కోర్సు ఉంది. లాసెట్‌తో ప్రవేశాలు జరుగుతాయి. స్థిరపడేందుకు ఎక్కువ సమయం తీసుకున్నా ఉపాధికి మాత్రం బాగుంటుంది. న్యాయవాదిగా వ్యాపార సంస్థలు న్యాయ సలహాదారులుగా రాణించవచ్చు.

● సాంప్రదాయ కోర్సులు

బీకాం జనరల్, కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ ఉంది. బీఎస్సీలోనూ అనేక కాంపిటేషన్ కోర్సులున్నాయి. వీటిలో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు.

● ఐఐటీతో సాంకేతిక విద్య

ఇంజనీరింగ్ విద్యపై ఆసక్తి ఉన్నత విద్యా సంస్థల్లో అభ్యసించాలనే వారికి ఐఐటీ ఎంతో ప్రయోజనకరం. ఇవి ఆఫర్ చేసే కోర్సుల్లో విద్యార్థులు వారి అభి రుచికి తగినవి ఎంచుకోవాలి.

● వైద్యమే ఆరాధ్యమైతే...


వైద్యవృత్తిపై ఆసక్తి ఉంటే ఎంబీబీఎస్ కోర్సు ఉత్తమం. నీట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా కళాశాలల్లో సీటు లభిస్తుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్, వంటి ఉద్యోగాలు పొందవచ్చు. సొంతంగా ఆస్పత్రి ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంబీబీఎస్‌లో సీటు రాకుంటే బీడీఎస్ చేరవచ్చు.

● ఫార్మసీకి ప్రాధాన్యం....

ఔషధరంగ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు అవకాశాలు విస్తృతంగా ఉంటున్నాయి. ఎంసెట్‌తోనే బీఫార్మసీ ప్రవేశాలు జరుగుతున్నాయి. ఇది పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ ఆఫీసర్, ఆసుపత్రుల్లో ఫార్మాసిస్టులుగా ఉదోగ్యాలు లభిస్తాయి.

నచ్చిన కోర్సులు ఎంపిక చేసుకోండి

తల్లిదండ్రులు చెప్పారని, స్నేహితులు తీసుకున్నారని ఏ కోర్సులోనూ చేరవద్దు. మార్కెట్లో డిమాండ్ కంటే మనస్సు డిమాండ్‌కే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఆసక్తి ఉన్న కోర్సులో చేరితే జీవితంలో అత్యున్నత స్థాయికి చేరవచ్చు. పట్టుదల ఉంటేనే ఏ కోర్సులోనైనా రాణించవచ్చు. ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసిన వారిలో ప్రతి 100 మందిలో 60 మందికి స్కిల్స్ లేవని కంపెనీలు తిరస్కరిస్తున్నాయి. ఆ జాబితాలో మీరు లేకుండా చూసుకోవాలి. తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలి తప్ప నిర్దేశం కాదు. ఇష్టమైన కోర్సులో పిల్లలను చేరనీయాలి. అందులో రాణించేలా ప్రోత్సాహం ఇవ్వాలి.




జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్




విశృత్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో జరగనున్న 54వ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన కేంద్రీ య విద్యాలయ విద్యార్థి తాటి విశృత్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ హకీంపేట ఎయిర్ ఫోర్స్ అకాడమీ కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించిన 54వ రీజనల్ స్కేటింగ్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన విశృత్ మూడు విభాగాల్లో పాల్గొని ఒక బంగారు, రెండు రజత పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ పోటీలకు ఎంపికైన విశృత్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అభినందించి శాలువాతో సత్క రించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశృత్ మున్ముందు జరిగే జాతీయ పోటీల్లో విశేష ప్రతిభచాటి రాష్ట్ర క్రీడా పతాకాన్ని ఎగురవేయాలని అన్నారు. విశృత్ గెలుపొందినందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోన్ ద్వారా ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ పంకజ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వామన్‌రావు, పీఈటీ వివేక్, స్కేటింగ్ కోచ్ గట్టు అనిల్ కుమార్‌గౌడ్, హరి పాల్గొన్నారు.



మానవ శరీరంలో కీలకం

నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



సుభాష్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం కాలేయం. కాలేయం జీవక్రియ, జీర్ణక్రియ, రోగ నిరోధక శక్తి, విష పదార్థాల వడపోత, విటమిటన్లు, ఖనిజాలు, గ్లూకోజు నిల్వ వంటి అనేక విధులను నిర్వహిస్తుంది. కాలేయం స్వీయ స్వస్థత ప్రత్యేక లక్షణాన్ని కలిగి ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి 20 లక్షల మంది కాలేయ వ్యాధుల వల్ల మరణిస్తున్నారు. మద్యం సేవించే వారిలో 7.5 శాతం నుంచి 10 శాతం మంది కాలేయ సంబంధిత వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. ఊబకా యులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా ఈ వ్యాధుల బారిన పడే అవ కాశం ఉంది. ఏటా కొత్త కేసుల్లో 35శాతం పెరుగుదల ఉంటుందని వైద్య నిపుణులు అంటున్నారు.

● అవగాహన లేక పోవడంతో....

వ్యాధి తీవ్రత సంబంధిత ప్రమాద కారకాలు, నివారణ గురించి ప్రజల్లో అవగాహన లేక పోవడంతో వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం చేస్తే కాలేయ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. మద్యం, ధూమపానం పూర్తిగా మానుకోవాలి.

● ఈ సంవత్సర థీమ్...

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏప్రిల్ 19న కాలేయ దినోత్సవం నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం థీమ్ 'ఆహారమే ఔషధం'. ఈ థీమ్ సమతుల్య ఆహారం ద్వారా కాలేయ వ్యాధులను నివారించడంలో పోషకాహారం కీలక పాత్రను చెబుతోంది.

● జంక్ ఫుడ్‌తో చాలా ప్రమాదం... డాక్టర్ ప్రణీత్, మెడికవర్ హాస్పిటల్ కరీంనగర్



గతంలో మద్యపానం చేసేవారికి మాత్రమే కాలేయం చెడిపోయేది. మారుతున్న జీవనశైలితో ప్రస్తుతం జంక్‌ఫుడ్‌తో ఫ్యాటీ లీవర్ ఎక్కువగా వస్తుంది. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, కలుషిత నీరు, ఆహారంతో హెపటైటిస్ ఏ అనే వైరస్ వస్తుంది. దీంతో పచ్చ కామెర్లు వంటివి వస్తున్నాయి. డ్రగ్ అడిక్షన్, ఇతరులకు వాడిన నిడిల్‌తో హెపటైటిస్ బీ, సీ వస్తాయి. పాశ్చాత్య పోకడల వల్ల నేటి యువత జంక్ ఫుడ్‌కు అలవాటు పడిపోతున్నారు. దీంతో 60లో రావలసిన వ్యాధులు 30లో వస్తున్నాయి.

తప్పుడు దస్తావేజులు సమర్పించిన వారిపై క్రిమినల్ కేసు

పెద్దపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తప్పుడు దస్తావేజులు సమర్పించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని పెద్దపల్లి తహసీల్దార్ డీ రాజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి భూంనగర్‌లోని సర్వే నంబర్ 694లో ఉన్న 309చదరపు గజాల భూమి ఠాకూర్ శంకర్ సింగ్ 2009లో కొనుగోలు చేశారు. ఆయన మరణం తర్వాత కూతురు ఠాకూర్ మధుమిత, తల్లి ఠాకూర్ శ్యామల తాము మాత్రమే హక్కుదారులమని తప్పుడు పత్రాలు చూపించి, కుమారుడు ఠాకూర్ అభిలాష్ ఉన్నట్లు మార్చి రిలిజ్ రైట్స్ డీడ్ పొందారని తెలిపారు. ఠాకూర్ అభిలాష్ సైతం అప్పటి కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కిషోర్ బాబుతో కుమ్మక్కై అతని తల్లి శ్యామల చనిపోయినట్లుగా తప్పుడు డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించి సదరు భూమిని ఠాకూర్ సాయి సంతోష్‌కు పెద్దపల్లి సబ్ రిజిస్టర్‌ను తప్పుదోవ పట్టిస్తూ విక్రయించారని అన్నారు. ప్రభుత్వ అధికారు లను తప్పుదోవ పట్టించినందుకుగాను ఠాకూర్ శంకర్ సింగ్ కుమార్తె ఠాకూర్ మధుమిత ఏ1, భార్య ఠాకూర్ శ్యామల ఏ2, కుమా రుడు ఠాకూర్ అభిలాష్ ఏ3, ఠాకూర్ సాయి సంతోష్ ఏ4, ప్రస్తుతం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో గ్రామపంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న కిషోర్ బాబు ఏ5గా పోలీసులు ఐపీసీ 420, 409, 464, 467 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని పెద్దపల్లి తహసీల్దార్ పేర్కొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

ముగ్గురికి గాయాలు

కొడిమ్యాల, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని చెప్యాల క్రాస్ రోడ్డు నుంచి దొంగలమర్రి బస్ స్టేజీ వైపు వెళ్తున్న కారు శుక్రవారం అదుపు తప్పి పక్కన ఉన్న కందకంలో బోల్తా పడింది. హైదరాబాదు నుంచి కారులో సుమారు పది మందితో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనం చేసుకొని కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్తుండగా కారు అదుపు తప్పి బోల్తా పడినట్లు తెలిసింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. గాయాల పాలైన వారిని చికిత్స నిమ్మిత్తం జగిత్యాల ఆసుపత్రికి 108 వాహనంలో సిబ్బంది తరలించారు. ఈ విషయమై కొడిమ్యాల ఎస్సై సందీప్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

యువకుడి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామానికి చెందిన అరెల్లి అజయ్ (22) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అజయ్ తల్లి పద్మ కొన్ని రోజులుగా కాన్సర్ వ్యాధితో బాధ పడుతూ చికిత్స పొందుతోంది. దీంతో మనస్తాపం చెందిన అజయ్ గురువారం తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోగా గమనించిన తండ్రి వెంకటి స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం కోరుట్లకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం జగిత్యాల తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. అజయ్ తండ్రి వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏటీఎంలలో చోరీకి పాల్పడుతున్న వ్యక్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పెద్దపల్లి డీసీపీ కరుణాకర్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి ఏటీఎంల్లో దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పెద్దపల్లి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ కార్యాలయంలో డీసీపీ కరుణాకర్ వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం అల్వార్ జిల్లాకు చెందిన అన్నదమ్ములు సిద్ధిక్‌ఖాన్, ఆరీఫ్‌ఖాన్ మరో నలుగురు ఆరీఫ్‌గుటారి, ఆష్ మహ్మద్, సాహిల్, ఇమ్రాన్ ముఠాగా ఏర్పడి ఏటీఎమ్‌ల వద్ద దోడిడీకి పాల్పడ్డారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో ఏటీఎంలో దోపిడీకి పాల్పడి వాటాలు పంచకుంటుండగా వివాదాలు తలెత్తి విడిపోయారు. సిద్ధిక్‌ఖాన్, ఆరీఫ్‌ఖాన్ మాత్రం తెలంగాణకు చేరుకొని వివిధ ప్రాంతాల్లో దోపిడీకి పాల్పడ్డారు.

ఈ నెల 15న ఉదయం పెద్దపల్లిలోని కునారం రోడ్డులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎమ్ వద్ద దోచుకునేందుకు సిద్ధమయ్యారు. అనుకున్న ప్రకారం వెంట తెచ్చుకున్న ఓ పరికరాన్ని ఏటీఎంలో అమర్చి ప్లాస్టర్ వేసి ఉంచారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పుట్ట శివకుమార్ ఐదు వందల రూపాయలు డ్రా చేసేందుకు ఏటీఎమ్ ఆపరేట్ చేశాడు. మిషన్ నుంచి డబ్బులు బయటకు రాకపోవడంతో డబ్బులు లేవనుకొని వెళ్లిపోయాడు. వెంటనే సిద్ధిఖ్, ఆరీఫ్‌లు ఏటీఎమ్‌లో అమర్చిన టీ ఆకారపు పరికరాన్ని తొలగించి ఐదు వందలు తీసుకున్నారు. శివకుమార్ బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యాయి. ముంబాయి సెక్యూరిటీ విభాగం నుంచి పెద్దపల్లి బ్రాంచీకి ఏటీఎమ్ తెరిచిన సమాచారాన్ని అందించారు. బ్యాంకు సిబ్బంది చుట్టపక్కల వెతికే సరికి ఎవరు లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెద్దపల్లిలో ఎస్‌బీఐ ఏటీఎంల్లో అమర్చిన పెట్రో కంపెనీ మిషన్లను వెతికారు. లేకపోవడంతో కాగజ్‌నగర్ వెళ్లేందుకు రైల్వే స్టేషన్ వచ్చారు. పోలీసులు సీసీ కెమరాల ఫుటేజీల ఆధారంగా రైల్వేస్టేషన్‌లో నిందితులను పట్టుకున్నారు. అయితే ఇలా అన్ని ప్రాంతాల్లో పెట్రో కంపెనీ ఏటీఎమ్‌లను టార్గెట్ చేస్తూ వెంట తెచ్చుకున్న పరికరాలతో డబ్బులు తీసుకుంటున్నారని తెలిపారు. ఇంకా పెద్ద ఎత్తున నగదు నష్ట పోకుండా అరికట్టిన సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, మల్లేష్ సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు. నిందితుల నుంచి టీ పరికరం ప్లాస్టర్లు, రేకు ముక్కలు, కట్టర్, రెండు సెల్ ఫోన్లు, ఐదు వందల నోట్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుచనున్నట్లు డీసీపీ తెలిపారు. ఆయన వెంట ఏసీపీ గజ్జి కృష్ణ ఉన్నారు.

జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉమ్మడి జిల్లాకు చెందిన జైనపురం నాగరాజు, కల్లెపల్లి చక్రధర్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వడ్లూరి రాజేందర్, జిట్టబోయిన శ్రీను తెలిపారు. వీరు ఈ నెల 19 నుంచి 23 వరకు బీహార్ రాష్ట్రంలో జరిగే 47వ జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ చైర్మన్ జగన్మోహన్‌రావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ తెలిపారు. వీరిని మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి, ట్రెజరర్ కలిగేటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి జెట్టిపల్లి అశోక్, సభ్యులు అనూప్ రెడ్డి, ఇతరవేని శ్రీనివాస్, భాస్కర్, రాజ్ కుమార్, మహేష్, లింగారావు అభినందించారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం శుక్రవారం భక్తజన సంద్రంగా మారింది. విద్యార్థులకు సెలవు రోజులు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు రాజన్న దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, కోడె మొక్కు క్యూలైన్‌లో సుమారు రెండు గంటలపాటు బారులు తీరిన భక్తులు స్వామివారలను దర్శించుకున్నారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరిండెంట్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హైందవ భక్తికళా సమ్మేళనం విజయవంతం చేయాలి..

హైందవ భక్తి కళా సమ్మేళనం నిర్వహించే సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ పిలుపునిచ్చారు. వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో విజయశంకర్ స్వామితో కలిసి శుక్రవారం హైందవ భక్తి కళా సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ మే 7వ తేదిన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో నిర్వహించే సభకు పెద్ద ఎత్తున హిందువులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

పాలకుర్తి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈసాలతక్కళ్లపల్లిలో ఉపాధిహామీ కూలీలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక హరి, లత దంపతులు శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలకు పని స్థలాల్లో టెంట్లు, చల్లని తాగునీరు అందు బాటులో ఉంచాలన్నారు. బసంత్‌నగర్ అల్ట్రా టెక్ సిమెంటు కంపెనీ అధికారులు తమ గ్రామం నుంచి గుట్టకు వెళ్లె రహదారిని బండరాళ్లు, మట్టితో నింపి మూసి వేయించారని కౌశిక హరి దృష్టికి తీసుకుపోయారు. తమ గ్రామానికి చెందిన పశువులు మేతకోసం గుట్టకు వెళ్లకుండా అడ్డుకున్నారన్నారు. కంపెనీ సంబంధిత అధికారులతో మాట్లాడి రహదారిని ఎప్పటిలాగే కొనసాగేలా ప్రయత్నం చేస్తానని హరి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్, నాయకులు ములుకల్ల కొమురయ్య, బండి శ్రీనివాస్, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తయ్యేనా?

ఎలిగేడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులు ముందుకుసాగడం లేదు. గ్రామాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అన్ని వసతులతో కూడిన పంచాయతీ నూతన భవనాలను నిర్మించి మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. ఎలిగేడు మండలంలో 12 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గ్రామ పంచాయతీలలో పాత భవనాలు శిథిలమవుతూ, ఇరుకు గదులతో పాలకవర్గాలు, అధికారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమస్యలను తెలుపుకునేందుకు వచ్చే గ్రామస్థులు సైతం అసౌకర్యానికి గురయ్యేవారు. ఇలాంటి సమస్యలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ అధునాతనంగా అన్ని హంగులతో కూడిన గ్రామపంచాయతీల్లో నూతన భవన నిర్మాణాలను చేపట్టేందుకు సంకల్పించింది. నూతనంగా నిర్మించిన భవనాల్లో విశాలమైన గదులు సర్పంచ్, కార్యదర్శులకు వేరువేరు కార్యాలయాలు సమావేశ హాలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను కల్పిస్తూ డిజైన్ చేశారు.


నారాయణపల్లిలో అర్ధాంతరంగా నిలిచిన పంచాయతీ భవనం

● **నత్తనడకన భవన నిర్మాణాలు..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు నూతన భవనాలకు ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కొక్క గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.20నిధుల చొప్పున కేటాయించింది. మూడేళ్ల క్రితం నారాయణపల్లి, బురహాన్‌మియాపేట, రాములపల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు చేపట్టిన కాంట్రాక్టర్లు కాలయాపన చేస్తుండడంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని కాంట్రాక్టర్లు తెలుపుతుండగా బిల్లులను విడుదల చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటివరకు స్లాబ్ వేసినప్పటికీ మిగితా పనులు పూర్తి కాలేదు. ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్, నర్సాపూర్ పంచాయతీ భవనాలు పూర్తయి అందుబాటులోకి వచ్చాయి.

మిగితా ర్యాకల్‌దేవ్‌పల్లి, శివపల్లి, లోకపేట, లాలపల్లి, ముప్పిరితోట గ్రామాల్లో భవన నిర్మాణాలకు స్థలాలు లేవనే కారణంతో నేటివరకు నిర్మాణ పనులను చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలని కోరుతున్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వరంగల్ సభకు సంబంధించి గోడపోస్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు చింపారని ఆపార్టీ నాయకులు ఆకుల స్వామి, వివేక్‌పటేల్ తెలిపారు ఈవిషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మళ్లి గ్రామాల్లో పుంజుకోవడంతో కొందరు ఓర్వలేక పార్టీపోస్టర్లు చింపారన్నారు. వారిపై పోలీసులు కటిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా రఘునాథచార్యుల తిరునక్షత్ర వేడుకలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 18: (ఆంధ్రజ్యోతి): శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచా ర్యుల తిరునక్షత్ర వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. రఘునాథ స్వామి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ వికాస తరంగిణి ప్రజ్ఞ కో ఆర్డినేటర్, రిటైర్డ్ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలు ఎస్ఎన్‌సీ వనజ, వికాస తరంగిణి ప్రతినిదులు అన్నమనేని స్వప్న, చిదురాల సుగుణ, ధనలక్ష్మి, భూలక్ష్మి, సునిత, తదితరులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మంథనిరూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్, అడవిసోమన్‌పల్లి, ఖాన్‌సాయిపేట, కన్నాల, విలోచవరం, సూరయ్యపల్లి, సిరిపురం, గుంజపడుగు, నాగారం, సూరయ్యపల్లి, కాకర్లపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో ఛైర్మన్ కొత్త శ్రీనివాస్, డైరెక్టర్లు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రావికంటి సతీష్, కొత్త శ్రీనివాస్, గడ్డం పోచం పెద్దిరాజు ప్రభాకర్, సిరిమూర్తి ఓదెలులు, బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, దేవళ్ళ విజయ్‌కుమార్, రాజబాబు, కిషన్‌రెడ్డి, లక్ష్మి, మాధవి, సంఘం సెక్రటరీ మామిడాల అశోక్‌లు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెతో ఎన్డీఏ సర్కారుకు గుణపాఠం చెప్పాలి

- ఐకమత్యంతో కేంద్రంపై పోరాటం - విలేకరులతో జేఏసీ నాయకులు స్పష్టీకరణ

జ్యోతినగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న తలపెట్టనున్న సార్వత్రిక సమ్మెతో ఎన్‌డీఏ సర్కారుకు గుణపాఠం చెప్పాలని జేఏసీ నాయకులు ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్, జిల్లా కార్యదర్శి ఇ నరేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సునీల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్టీపీసీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్త సమ్మెకు అన్ని జాతీయ సంఘాలు పిలుపునిచ్చాయని, సమ్మెను విజయవంతం చేసి కార్మిక సంఘాల తడాఖా చూపాలన్నారు. ఈ సారి సమ్మెను విజయవంతం చేయడంలో భాగంగా దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టామన్నారు. కేంద్రం దూకడుగా కార్మిక రంగంపై తీసుకుంటున్న నష్టదాయకమైన నిర్ణయాలపై కార్మికుల్లో చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా, యూనియన్ల జెండాలు, విధానాలు వేరైనప్పటికీ కార్మిక శ్రేయస్సు కోసం ఐకమత్యంగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం అధికార బలం ఉందని నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు. లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు తమ హక్కుల్ని కోల్పోతారని, సమ్మె చేసే హక్కే ఉండదని, 12 గంటల పని విధానం ఉంటుందన్నారు. కార్పొరేట్, ప్రైవేటు శక్తులకు ప్రయోజనం చేకూరేలా లేబర్ కోడ్‌లను రూపొందించారన్నారు. దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నదని, లాభాల్లో ఉన్న పీఎస్‌యూలను సైతం కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కేంద్రం వైఖరిని తిప్పికొట్టేందుకే దేశవ్యాప్త సమ్మెకు దిగామన్నారు. కార్మికులకు నెలకు 26 వేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని తదితర 12 డిమాండ్లతో జాతీయ యూనియన్లు సమ్మెలోకి వెళ్తున్నాయని వారు తెలిపారు. కార్మికులు, అన్నివర్గాల ప్రజలు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బూమల్ల చందర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు చిలుక శంకర్, సీఐటీయూ నాయకులు నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, ఏఐటీయూసీ నాయకుడు లక్ష్మణ్, టీయూసీఐ నాయకుడు రమేష్, గుర్తింపు సంఘం నాయకులు వేముల కృష్ణయ్య, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక జేఏసీ నాయకులు

పుస్తెమట్టెలు అందజేత

ఎలిగేడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అమరగాని నారాయణగౌడ్ కూతురు ప్రవళికకు కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో కల్యాణ మస్తు పథకంలో భాగంగా శుక్రవారం పుస్తె మట్టెలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్ సుధాకర్‌రావు, పాల కేంద్రం ఛైర్మన్ లక్ష్మణ్‌రావు, సూపర్‌వైజర్ కృష్ణ, కార్యదర్శి మహేందర్, పాల కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు చేయూత

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌కుచెందిన ఎస్. రమ అనే నిరుపేద మహిళకు సహృదయ ఫౌండేషన్(యుఎస్ఏ), నీడ స్వచ్ఛంద సంస్థలు శుక్రవారం చేయూతనిచ్చాయి. ఆరు సంవత్సరాల క్రితం భర్తను కోల్పోయిన రమ ఇద్దరుపిల్లలతో ఉన్న ఇంటి ముందు గోడ, బాత్రూంలు కూలిపోవడంతో వాటిని నిర్మించేందుకు అవసరమైన సిమెంట్ బస్తాలు, లేబర్ చార్జీలను రమకు నీడ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పల్లెర్ల రమేష్ అందించారు. కార్యక్రమంలో శ్రీరామ విద్యానికేతన్ ప్రిన్సిపల్ సూర్యదేవర జ్యోతి, నసీమా తదితరులు పాల్గొన్నారు.



ఆర్జీ-3లో క్వార్టర్స్ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో కార్మికులకు క్వార్టర్స్ కౌన్సెలింగ్ చేపట్టారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ఆదేశాల మేరకు ఎస్అండ్‌పీసీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. మొత్తం 167 ఖాళీ క్వార్టర్స్ ఉండగా ఫ్రెష్, చేంజ్‌ఆఫ్ క్వార్టర్స్ కోసం 31 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 11 మంది ఉద్యోగులు హాజరై 10 మంది క్వార్టర్స్‌ను ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం బీవీ సత్యనారాయణ, నాయకులు ఎమ్మార్సీ రెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, అధికారులు సుదర్శనం, గుర్రం శ్రీహరి, ఫణీంద్ర, మణిదీప్, సిబ్బంది మహేందర్, సదయ్య పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలపై జీఎం సమీక్ష

రామగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని అడ్రియాల ప్రాజెక్టు సంక్షేమాధికారులతో సంక్షేమ కార్యక్రమాలపై ఏపీఏ జీఎం నాగేశ్వర్‌రావు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన టర్మినల్ బెనిఫిట్స్, కారుణ్య నియామక ఉద్యోగాల కల్పన, పదోన్నతులు క్రమశిక్షణ చర్యలు తదితర అంశాలపై జీఎం దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అధికారులు బండి సత్యనారాయణ, ప్రవీణ్, ఫాటింగ్, సుదర్శనం, గుర్రం శ్రీహరి, సునీల్, ప్రసాద్, మతీన్, రాజేశం, రవిచంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ


ప్లీనరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యమకారులు

రామగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం శుక్రవారం ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 21న సికింద్రాబాద్ సీతాఫల్మండి జీహెచ్ఎంసి ఫంక్షన్‌హాల్‌లో ఉద్యమకారుల డిమాండ్‌ల పరిష్కారానికై నిర్వహించ తలపెట్టిన సమావేశంలో భాగంగా స్థానిక రాణిరుద్రమాదేవి క్రీడప్రాంగణం ఎదుట గల అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు నూనెరాజేశం, పోతు జ్యోతిరెడ్డి, కళాధర్‌రెడ్డి, బత్తుల శంకర్, తొగరి స్వామి, తిరుపతి, ప్రకాశ్, విష్ణు భక్తుల సారయ్య, సిద్దం మోహన్‌లు పోస్టర్ ఆవిష్కరించారు. పెద్దసంఖ్యలో తరలిరావలని పిలుపు నిచ్చారు.

మేరు సంఘం అధ్యక్షుడిగా మామిడిశెట్టి శ్రీనివాస్


మేర సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ధర్మారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) ధర్మారం మండలం మేరు సంఘం అధ్యక్షుడిగా ధర్మారం గ్రామానికి చెందిన మామిడిశెట్టి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఓదెల నరేష్, కోశాధికారిగా కందుల సతీష్, ఉపాధ్యక్షులుగా మామిడిశెట్టి చిన్న కొండయ్య, ప్రచార కార్యదర్శిగా కందుల మల్లేశం, సహాయ కార్యదర్శిగా కొట్టూరి శ్రీనివాస్, సహాయ ప్రచార కార్యదర్శిగా ఓదెల సంతోష్, సహాయ కోశాధికారిగా ఓదెల రమేష్, ముఖ్య సలహాదారులుగా ఓదెల శ్రీనివాస్, మామిడిశెట్టి పెద్ద కొండయ్య, కార్యవర్గ సభ్యులుగా మామిడిశెట్టి తిరుపతి, రాపర్తి గంగాధర్, మామిడిశెట్టి రాకేష్, గట్ల అజయ్, గట్ల మధూకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మామిడిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సహాయ సహకారాలతో మేరు భవన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మేర కులస్థులకు మేరు ఫెడరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వం తమను గుర్తించిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేర సంఘం నాయకులు పాల్గొన్నారు.

మంథని సీతారామ సేవాసదన్ సేవలు అభినందనీయం

ధర్మపురి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మంథని సీతా రామ సేవా సదన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సంఘంలో ప్రజల సౌకర్యార్థం మంథని సీతారామ సేవా సదన్ సౌజన్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్ సర్వీస్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు ఇందారపు రామయ్య, ప్రధాన కార్యదర్శి నందగిరి గిరిధర్, అన్నపూర్ణ సేవా సంస్థ, గాయత్రి నిత్యాన్న సత్ర సంఘం నిర్వాహకులు కొరిడె దత్తాత్రి పాల్గొన్నారు.

క్రీస్తు చూపిన మార్గంలో నడవాలి




మంథనిలో సువార్త ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు, గోదావరిఖనిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

మంథని, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, సహనం, శాంతికి నిర్వచనం క్రీస్తు ప్రభువు అని, ఆయన చూపిన మార్గంలో అందరూ నడుస్తూ ప్రపంచం శాంతిమయం కావాలని పాస్టర్ దూడ మహేష్ ఆకాంక్షించారు. స్థానిక సీయోను ప్రార్థన మందిరంలో గుడ్‌ఫ్రైడే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.

క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దిక్సూచి అని, ఏసు అనుగ్రహం అందరిపై ఉండాలన్నారు. మానవాళి పాప పరిహారార్థం క్రీస్తు సిలువ మరణం పొందాడని, శాంతిమార్గం చూపిన మహనీయుడు ఏసుక్రీస్తు అన్నారు. ఈ సందర్భంగా శ్రీపాద కాలనీలోని చర్చి నుంచి అంబేద్కర్ చౌక్ వరకు సిలువ ధ్యాన సువార్త ర్యాలీని నిర్వహిచారు. కార్యక్రమంలో పాస్టర్ మార్క్, దయరాజు, సామ్యూల్, రాజేష్, దాస్, సంఘ పెద్దలు అంకిరి కుమార్, జోసెఫ్, ప్రసాద్, రమేస్, ప్రేమ్‌కుమార్, సదానందం, కుమార్, సదానందం, స్త్రీల కమిటీ నాయకులు పద్మజ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గాంధీనగర్‌లోని సీఎస్ఐ, గ్లోరియస్, ఈఎఫ్ఐ, కృష్ణానగర్, సెక్రెడ్ హార్ట్ చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థలు నిర్వహించారు.

జూలపల్లి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు వడుకాపూర్, తెలుకుంటా, కుమ్మరికుంట,పెద్దాపూర్, ఆయా గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రై డే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గల చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఈకార్యక్రమంలో ఆయా చర్చీల పాస్టర్లు, క్రిస్టియన్‌లు పాల్గొన్నారు.

ధర్మారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని యెహోవాయీరే ప్రార్థన మందిరంలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కర్నే థామస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకలను విజయవాడ నుంచి వచ్చిన సాల్మోన్ క్రీస్తు భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా భక్తులు గీతాలు ఆలపించి దేవుడిని ఆరాదించారు.

శ్రీపాద స్మారక బస్టాండ్‌కు భూమి పూజ


బేగంపేట్‌లో బస్‌షెల్టర్‌కు భూమి పూజ చేస్తున్న నాయకులు

రామగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారక బస్‌స్టాండ్‌కు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భూమి పూజ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు దాసరి శివకుమార్, కల్వల శంకర్, బర్లశ్రీనివాస్, ముస్త్యాల శ్రీనివాస్, కాటం సత్యం, అవినాష్‌గౌడ్, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవాన్ని విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసి సగర్వంగా నిలిపింది గులాబీ జెండా అని, బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా గురువారం స్థానిక మార్కండే యకాలనీలోని ఒక ఫంక్షన్ హాల్లో లక్ష్మీనగర్ పట్టణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ స్థాపించి, ప్రజలను కదిలించి ఉద్యమం చేయకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన అబద్ధాలను నమ్మి ప్రజలు అధికారం ఇచ్చారని, కానీ వచ్చిన అవకాశాన్ని ఆ పార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోక ఆగమాగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను కంటికి రెప్పలా కాపాడిందని, అధికారం కోల్పోయినా ప్రజల వెంటనే ఉంటుందని, తమకు ఓట్లు వేయలేదని ప్రజలను ఏనాడు నిర్లక్ష్యం చేయలేదన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ ఒక్కటే ఈ రాష్ట్ర ప్రజలకు రక్షణగా ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ 25వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా రజతోత్సవ వేడుకల్లో భారీ బహిరంగ సభకి రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలని కోరారు. బీఆర్ఎస్ లక్ష్మీనగర్ అధ్యక్షుడు నూతి తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, చల్లా రవీందర్‌రెడ్డి, ఆడప శ్రీనివాస్, శ్రీరామోజు మహేష్, నారాయణదాసు మారుతి, రాచకొండ శ్రీనివాస్, గాలి లింగన్న, కాగితం శ్రీనివాస్, గుర్రం పద్మ, మంజుల భాను, ఐల్ల నాగరాజు, బొడ్డు స్వామి, నాగరాజు, సంజీవ్, సురేష్ కాగితం, గూటం కొమురయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

అడిషనల్ మేనేజర్ పై దాడి చేసిన వారిపై చర్యలు చేపట్టాలి


ఆర్జీ-3 జీఎంకు వినతిపత్రం అందిస్తున్న అధికారుల సంఘం నాయకులు

రామగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధీలోని ఓసీపీ-2 అడిషనల్ మేనేజర్ కొలా శ్రీనివాస్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జీఎంలకు శుక్రవారం అధికారులు వినతిపత్రం అందజేశారు. ఆర్జీ-3, ఏపీఏ అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో అధికారులు ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. విధినిర్వహణలో ఉన్న అధికారిపై సంబందంలేని వ్యక్తులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సింగరేణిలో కాంట్రాక్టు పనులు నిర్వహిస్తున్న సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకులు గ్రంధి శ్రీనివాస్, పులి మహేందర్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రాల అందజేత

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2లో మెడికల్ ఇన్వాలిడేషన్ పొంది కారుణ్య నియామకాలకు అర్హత పొందిన 10 మంది మాజీ ఉద్యోగుల వారసులకు శుక్రవారం జీఎం కార్యాలయంలో జీఎం బండి వెంకటయ్య నియామకపత్రాలను అందజేశారు. సింగరేణిలో ఉద్యోగం బాధ్యతతో కూడుకున్నదని, సంస్థ అభివృద్ధి కోసం శ్రమించాలని జీఎం సూచించారు. క్రమశిక్షణతో పనిచేస్తూ ఉత్తమ ఉద్యోగిగా ఎదగాలని, దేశ పారిశ్రామికాభివృద్ధిలో సమర్థవంతమైన పాత్రను పోషించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, అధికారులు నెహ్రూ, సంతోష్‌కుమార్, అనిల్‌కుమార్, మురళీకృష్ణ పాల్గొన్నారు.


కారుణ్య నియామక పత్రాలను అందజేస్తున్న జీఎం వెంకటయ్య